


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

### చీకటి వెనుక వెన్నెల

చీకటి మనిషిని భయపెడుతుంది. అందుకే దేవుడు ఆ సమయంలో చాలా భాగాన్ని నిద్రకి కేటాయించాడు. మిగతా సమయంలో చీకటి అంటే భయం పోవడానికిగానూ ఆ చీకటిలోనే అప్పుడప్పుడు వెన్నెలని ప్రవేశపెట్టాడు.

ప్రతి చీకటిలోనూ వెన్నెల నింపొచ్చు. అప్పుడు మనిషికి భయమంటే తెలియదు. కానీ మనిషికి భయమంటే తెలియాలి. తెలిస్తేనే భయానికి విరుగుడు కనిపెడతాడు. ఐనాకూడా ఎప్పుడూ చీకటే ఉంటే మనిషిలో నిరాశా నిస్పృహలు కలుగుతాయి. చీకటి వెనుకనే వెన్నెల వస్తుందన్న భావన మనిషిలో ఆశ నింపుతుంది. ఆశ ఒక్కటే మనిషికి భావిపట్ల ఆసక్తిని పుట్టిస్తుంది.

చీకటి భయం. ఆశ వెన్నెల.

నాకు జర్మన్ వృద్ధుడి పరిచయం చీకటైతే, రెండు రోజుల్లోనే వెన్నెల నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

జూలై 26న, మేము రోజూ భోంచేసే హొటల్ ఓనర్ ఫ్రౌ హెన్నీ బెక్కర్ నన్నూ, నటరాజన్, లాల్, శర్మ, బిశ్వాస్, క్రంకెన్‌గుప్తాలనీ – మర్నాడు మధ్యాహ్నం తనింటికి విందుకు పిలిచింది.

ఆ పిలుపుకి మేమందరం కూడా చాలా ఆశ్చర్యపడ్డాం.

ఎందుకు పిలిచిందో తెలియదు. పిలిచేక అక్కడికి వెళ్ళినప్పుడు ఏం ఫార్మాలిటీస్‌పాటించాలో తెలియదు.

మాలో మేము బాగా చర్చించుకున్నాం. “ఈ విషయమై ఎక్కువ ఆలోచించొద్దు. ఆమెకివ్వడానికి బొకే ఒకటి కొని పట్టుకెడదాం” అన్నాడు లాల్.

ఆ ప్రకారం శనివారం నాడు ఓ బొకేతో ఆమె ఇంటికి వెళ్ళాం.

హెన్నీ బెక్కర్ ఏర్పాట్లు ఘనంగా ఉన్నాయి. ముందామె మాకో అందమైన యువతిని పరిచయం చేసింది. ఆమె తన అన్న కూతురుట. బార్బర్ షాపులో పని చేస్తోందిట. అత్తను చూడ్డానికి సెలవు పెట్టుకునొచ్చింది.

“నాయి (మంగలి) యార్” అన్నాడు నటరాజన్ అప్రయత్నంగా.

హెన్నీ బెక్కర్ పార్టీకోసం ప్రత్యేకంగా కేక్ తయారు చేయించింది. ఆ కేక్ చాలా రుచిగా ఉంది. నేను కాఫీ తాగనని తెలుసు కాబట్టి నాకోసం పాలు ఉంచింది. మిగతావాళ్లతో, “చిన్నపిల్లాడు కదా, ఇతను పాలే తీసుకోవాలి” అని నవ్వి నాకేసి ముచ్చటగా చూసింది.

లాల్‌వెంటనే, “నీకు తెలియదా, అతనికి పెళ్లయింది. ఇద్దరు పిల్లలు” అన్నాడు.

ఫ్రౌ హెన్నీ బెక్కర్ ఆశ్చర్యంగా, “అయితే, నీ వయసెంత?” అనడిగింది.

నేను చెప్పగానే, “ఇరవై లోపు అనుకున్నాను” అని అస్పష్టంగా గొణుక్కుంది.

బ్రాహ్మణుడు, మేక కథలో లాగా – నా వయస్సు ఇరవై లోపే ఏమోనని నాకూ అనిపించసాగింది.

నాకు పాలు, మిగతా అందరికీ కాఫీలు, కోన్యాక్. మాలో కోన్యాక్ తీసుకున్నది శర్మ ఒక్కడే.

అప్పుడు హెన్నీ బెక్కర్ తన హొటల్‌గురించిన వివరాలు చెబుతూ, “పదిహేను సంవత్సరాలుగా ఈ హోటలు నడుపుతున్నాను. ఇంతవరకూ ఏ కస్టమరునీ నా ఇంటికి ఆహ్వానించలేదు” అంది.

మేము క్రమం తప్పకుండా ఆమె హొటలుకి వెళ్లేవాళ్లం. మా ప్రవర్తనకు ఆమె ముగ్ధురాలైందిట. ఆ మాట చెబుతూ ఆమె టర్కిష్ విద్యార్థుల్ని ఏవగించుకుంది. హోటల్లో పని చేసే యువతుల్ని వాళ్లు చాలా అల్లరి పెట్టేవారు.

ఆమె భావనలో న్యాయముంది. అక్కడి ఆడపిల్లలు మన దేశపు అమ్మాయిల్లా కాక, లిబరల్‌గా ఉంటారు.

ఒకసారి మ్యాయా హుషారుగా కనబడ్డ ఓ అమ్మాయిని, ‘హాబెన్‌జీ జైట్’ (నీకు టైముందా?) అనడగడం చూశాను. నిజానికలా అడగడంలో భావం, నాతో వస్తావా అనే! ఇండియాలో ఐతే, 'చెప్పు తెగుద్ది' అని బదులొస్తుంది. ఒకోసారి పెద్ద గొడవౌతుంది కూడా. కానీ ఆమె సింపుల్‌గా, ‘నైన్’ (నో) అని నవ్వేసి వెళ్లిపోయింది. అదక్కడ మామూలేననీ, ఎవరు ఎస్ అంటారో తెలియరు కాబట్టి ఓ ట్రయల్ వేస్తుంటాననీ మ్యాయా అన్నాడు. అలాంటి స్పోర్టివ్ అమ్మాయిలు కూడా నొచ్చుకునేలా ఉండేది హొటల్లో కొందరు టర్కిష్ అబ్బాయిల ప్రవర్తన. అది మేము చూశాం. మీద చెయ్యేస్తుంటే నవ్వుతూ తప్పించుకున్న ఆ యువతుల మనోవ్యధ నాకిప్పుడర్థమైంది.

“పదిహేనేళ్లుగా హోటల్ నడుపుతున్న నాకు ఇన్నేళ్లకి కొందరిని ఇంటికి విందుకి పిలవాలని మొదటిసారిగా అనిపించింది. అందుకు పూర్తిగా మీరు, మీ ప్రవర్తనే కారణం. మీకు నా అభినందనలు” అందామె.

మేమందరం పరస్పరం ముఖముఖాలు చూసుకున్నాం. అందరి ముఖాల్లోనూ గర్వంతో కూడిన సంతోషం.

ఊళ్లో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ జాబితాలో రెస్టారెంట్లు చాలానే ఉన్నా, మేము మాత్రం రెండు నెలలుగా క్రమం తప్పకుండా ఆమె హొటల్లోనే తిన్నాం. మిగతా రెండు నెలలూ కూడా అక్కడే తినాలనుకుంటున్నాం. కారణం అక్కడ లభిస్తున్న మర్యాద, మన్నన, ఆత్మీయతాభిమానాలు. అంత మంచి హోటలుకి యజమాని – కస్టమర్సుమైన మమ్మల్ని ఇంటికి పిల్చి మరీ స్వయంగా మా మంచితనాన్ని పొగడ్డం గర్వకారణమే కదా!

తర్వాత మా మధ్య సంభాషణ నెమ్మదిగా ఊపందుకుంది. ముందుగా ఫ్రౌ హెన్నీ బెక్కర్ ఇండియన్సుకి సంబంధించి తన దృష్టికొచ్చిన పరస్పర విరుద్ధమైన అనుభవాలు కొన్ని చెప్పింది.

1957లో ఒక ప్రొఫెసర్ ఆమె హొటల్లోనే భోంచేసేవాట్ట. అతనికి వండిన కోడిని ఇస్తే, ఎముకకూడా మిగల్చకుండా మొత్తం లాగించేసేవాడుట. కొద్ది సంవత్సరాల క్రితం వచ్చిన ఇద్దరు ఇండియన్సు ఉదయమూ, సాయంత్రమూ కూడా కోడిగుడ్లు తప్ప మరే మాంసాహారమూ ముట్టేవారు కారుట. ఈ ఏడు వచ్చినవాళ్లలో నేను, సుబ్రహ్మణ్యం కోడిగుడ్లు కూడా తినని శాకాహారులమట.

ఆమె శాకాహారం గురించి నన్ను కొన్ని ప్రశ్నలడిగింది. వెటకారంగా కాదు, కుతూహలంతో. అవి నాకు కొత్త కాదు. నా పరిజ్ఞానాన్నీ, అనుభవాల్నీ జోడించి చేతనైనంతలో ఆమెకి బదులిచ్చాను. ఆమె థాంక్సు చెప్పింది.

ఆ సమావేశంలో మాకు ఆమె గురించి మరికొన్ని విషయాలు తెలిశాయి. మొదట్లో హోటల్ని రెండు పూటలా నడిపేదిట. నాలుగైదేళ్లుగా, ఒంటిపూట మాత్రమే నడుపుతోందిట. పదిహేనేళ్లుగా గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌వారు ఒకో మీల్సు టికెట్‌కి నాలుగున్నర మార్కులు మాత్రమే ఇస్తున్నారుట. ఏటేటా ధరలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో తనకిది చాలా ఇబ్బందిగా ఉన్నదంది ఆమె.

మేము బై చెప్పినప్పుడు ఆమె చిన్న రిక్వెస్టు చేసింది. ఆ ఏడాది అక్కడికొచ్చిన ఇండియన్సు మొత్తం అందరివీ ఫొటోలూ, సంతకాలూ కావాలని అన్నదామె. వాళ్లు ఆమె కస్టమర్సే కానవసరం లేదని చెప్పడంలో ఆమెకి ఇండియన్సుమీద కలిగిన ప్రత్యేకాభిమానం అర్థమైంది.

మేము సరేననడమే కాదు – ఆమె చిత్తశుద్ధితో అడిగిందని గ్రహించినవారిమై, అదే చిత్తశుద్ధితో పూనుకుని, ఆమె అడిగిన విధంగా ఫొటోలూ సంతకాలూ సేకరించి వెళ్లేలోగా ఆమెకి అందజేశాం.

## ఇది శృంగారమోయ్

మనిషి జీవితంలో శృంగారం అంతర్భాగం. మన దేవాలయాల్లో పచ్చి శృంగారానికి రూపశిల్పాలు ఉండొచ్చు. మన ప్రబంధాల్లోనూ, చివరికి దేవీ స్తోత్రాల్లోనూ పచ్చి శృంగారానికి తావుండొచ్చు. ప్రపంచాన్నే అబ్బురపరిచే కామసూత్రాలకు మూలాలు మన దేశంలోనే ఉండి ఉండొచ్చు. కానీ మన సంప్రదాయంలో శృంగారంపై ఉన్న అదుపు ఇంతా అంతా కాదు. పాశ్చాత్యదేశాల్లో అడుగెట్టిన ప్రతి భారతీయుడికీ – అక్కడి విశృంఖల శృంగారం పట్ల ఆశ్చర్యంతోపాటు, కుతూహలం కూడా ఎక్కువగా ఉంటే ఆశ్చర్యమేం లేదు.

ల్యూనబర్గులో అడుగెట్టిన వారం లోపే – అక్కడి షాపుల్లో యథేచ్ఛగా లభ్యమయ్యే శృంగార పుస్తకాలు చూశాం. నీలిచిత్రాల థియేటర్ల (కీనో) ముందు వాల్‌పోస్టర్లలో – ఆధునిక స్త్రీపురుషుల నగ్నచిత్రాల్ని మన ఖజురాహో శిల్పాల్ని మించిపోయిన భంగిమల్లో చూశాం.

ఇలాంటి విషయంలో బిశ్వాస్‌కి దూకుడెక్కువ. ముందు కీనోకి వెళ్లి ఓ నీలి చిత్రం చూసొచ్చాడు. ఎవరో అన్నారుట – నైట్‌క్లబ్ ముందు నీలి చిత్రాలు దిగదుడుపని. వెళ్లాలని కోరిక పుట్టింది. మిగతావాళ్ల తత్వం తెలిసింది కాబట్టి, మమ్మల్నెవర్నీ అడక్కుండా, తనకి పక్కనే ఉంటాడు కాబట్టి నటరాజన్‌ని బాగా బలవంతపెట్టాడు. ఇలాంటి విషయాల్లో బలవంతానికి లొంగడమంటే, ఆంజనేయుడు బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డం లాంటిదే. మనసులో ఏదో మూల తనకీ చూడాలనుంది కాబట్టి నటరాజన్ సరేనన్నాడు. వాళ్లిద్దరూ వెళ్లి ఒక రాత్రి నైట్‌క్లబ్ చూసొచ్చేశారు. తర్వాత బిశ్వాస్, “క్లబ్బు కొండయితే, నీలిచిత్రాలు అద్దం మాత్రమే” అని మా కుతూహలాన్ని మరింత పెంచాడు. ఆ తర్వాత హాంబుర్గులో రీపర్‌బాన్ స్ట్రాసే చూసి ముక్కున వేలేసుకున్నాం. సుబ్రహ్మణ్యం కోపెన్‌హాగన్ వెళ్లొచ్చి, మనుషుల్నీ, జంతువుల్నీ, సరీసృపాల్నీ – శృంగార భాగస్వాముల్ని చేసిన వెర్రితలల్ని వివరిస్తుంటే షాక్ తిన్నాం.

“ఇది స్వేచ్ఛ. దీన్ని అభినందించాలి” అంటాడు బిశ్వాస్.

“ఈ స్వేచ్ఛవల్ల ప్రయోజనమేమిటి? సంస్కారాన్ని నమ్మేవారికి కళ్లముందు సాటి మనుషుల సజీవ నగ్న ప్రదర్శన కలిగించే అనుభూతి ఏమిటి?” అన్నవి నా సందేహాలు. ఆ సందేహాలకు నాకు దొరికిన సమాధానాలు, ఈ విశృంఖలతపట్ల కొత్త అవగాహన కలిగించగలదని నాకు అనిపించింది.

ల్యూనబర్గ్ యాభైవేల జనాభా ఉన్న చిన్న ఊరు కావచ్చు కానీ అక్కడా నైట్‌క్లబ్బులున్నాయి. ఇండియాలో పెద్ద నగరాల్లో నైట్‌క్లబ్బున్నాయిట. కానీ అక్కడ వాటికి వెళ్లడం కొందరికి హోదా. చాలామంది మధ్యతరగతివారికి అవి సమాజ సంస్కారపరంగా నిషిద్ధాలు. అందువల్ల అప్పటికి ఎక్కువగా కలిసి తిరిగే మా మిత్రబృందం ఐదుగురిలో ఎవ్వరికీ నైట్‌క్లబ్ చూసిన అనుభవం లేదు. నటరాజన్, బిశ్వాస్ చూసొచ్చేక, మిగతా ముగ్గురిలోనూ వేడి పుట్టింది. ఆ ముగ్గురం – నేను (తెలుగు), దేవదార్(మహారాష్ట్ర), కొరియా (రాజస్థాన్).

జర్మనీలో అది చాలా మామూలు విషయం కాబట్టి ఒకసారి నైట్‌క్లబ్బుకి వెళ్లి రావాలని అనుకున్నాం. పెద్ద సిటీలలో అయితే నైట్‌క్లబ్ ఛార్జిలు బాగా ఎక్కువుండొచ్చుట. ఆ అనుభవానికి ల్యూనబర్గులాంటి చిన్న ఊళ్లే మెరుగని నిర్ణయించుకున్నాం. కానీ టిపికల్ ఇండియన్ మెంటాలిటీ ఎక్కడికి పోతుంది? మనసులో ఏదో తప్పు చేస్తున్న భావన. అందువల్ల మాలో ప్రతి ఒక్కరికీ తటపటాయింపు.

కొంపలు మునిగిపోతున్నట్లు తక్షణం సమావేశమై ఒక బృందంగా ఏర్పడి కార్యక్రమం రూపొందించాం.

ఒక రాత్రి పది ప్రాంతాల మేము ముగ్గురం అమ్‌శాండే మార్కెట్ సెంటర్లో కలుసుకున్నాం. అక్కణ్ణించి బయల్దేరి ముగ్గురం కలిసి ఓ నైట్‌క్లబ్ చేరుకునేసరికి రాత్రి పదకొండయింది.

టికెట్ మనిషికి ఐదు మార్కులు. నేను ఓవర్‌కోట్ వేసుకుని వెళ్లడంవల్ల అది ఉంచడానికి వేరే యాభై ఫెనిగ్సు ఇవ్వాల్సి వచ్చింది.

క్లబ్బులో కోకాకోలావంటి మృదు శీతల పానీయాలు లేవు. ఉన్నవన్నీ బరువైన నిషా ఇచ్చేవే. ఉన్నంతలో నిషాపరంగా తేలికైన పానీయం బీరు ఒక్కటే. లోపలికెళ్లాక ఏదో ఒకటి ఆర్డరివ్వాలి కాబట్టి, మేము తలొక బీరూ ఆర్డరిచ్చాం. బయట కొనుక్కుంటే బీరు బాటిల్ ఒకొక్కటి యాభై ఫెనిగ్స్. ఇక్కడ అదే బాటిల్ ఆరు మార్కుల యాభై ఫెనిగ్స్. మూడు బీరు బాటిల్సు వచ్చాయి. నేను బీరు తాగను కాబట్టి నా బాటిల్‌కూడా వారిద్దరికీ ఇచ్చేశాను.

ఇలా వెళ్లామో లేదో అలా కనబడింది – మా ఊహకందని షాక్‌ఇచ్చే దృశ్యం!

సుమారు ముప్పైఏళ్ల మహిళ – కాళ్లకి మేజోళ్లు, షూస్‌మినహాయించి వంటిమీద మరే ఆచ్ఛాదనా లేదు. ఆమె నిలబడి నృత్యం చేస్తోంది. ఆమె అంగాంగ ప్రదర్శన ఎంత పచ్చిగా ఉందో సరిగ్గా చెప్పడానికి భాష కూడా అంత పచ్చిగానూ ఉండాలి.

అంత వెంటనే అలాంటి దృశ్యం చూడ్డానికి మానసికంగా సిద్ధపడి లేమేమో – మేము ముగ్గురం నిశ్చేష్టులమై కాసేపు అలా నిలబడిపోయాం. ఆమె ప్రదర్శన ఎప్పుడు మొదలయిందో తెలియదు కానీ, మేము వెళ్లేసరికి ముగింపుకి వచ్చినట్లుంది. కాసేపట్లోనే ఆమె పక్కకు తప్పుకుంది.

నగ్న యువతి – మాకు పదడుగుల లోపు దూరంలో. దాపరికం లేకుండా అనాటమీని ప్రదర్శిస్తోంది. మేము వైద్య విద్యార్థులమైనట్లు తన శరీర రహస్యాలన్నీ తనే వివరిస్తోంది. చుట్టూ ఉన్న మగాళ్లు తామేదో గొప్ప ప్రదర్శన చూస్తున్నట్లు, మహోత్సాహంగా ఉన్నారు. మధ్యమధ్య చప్పట్లతో ప్రోత్సహిస్తూ ఆమె ప్రదర్శనని ఆనందిస్తున్నారు.

మా చిన్నతనంలో పెళ్లిళ్లకు, పండుగలకు భోగం మేళాలు ఉండేవి. అక్కడ వయసులో ఉన్న యువతులు నాట్యం చేసేవారు. నేటి ఐటం డ్యాన్సుల్లా కాక ఆ నృత్యాలు చాలా సభ్యంగా ఉండేవి. చేసేవారు వేశ్యలు కాబట్టి ప్రేక్షకులు వారితో సరసోక్తులాడేవారు. నేటి శాసనసభల్లోలా కాకుండా, ఆ భాష సరసంగానే ఉండేది. నృత్యాంగనలు చిరునవ్వులతో బదులిచ్చేవారు. ఎటొచ్చీ మధ్యమధ్యలో నృత్యాంగనల్లో ఒకరో ఇద్దరో మాయమైపోతూండేవారు. అదే సమయంలో ప్రేక్షకుల్లోంచీ ఒకరిద్దరు పురుషపుంగవులూ మాయమయ్యేవారు.

భోగంమేళాలు ఇలా ఉంటాయని మిత్రులద్వారా వినడమే ఎక్కువ. నేనూ, మా అన్నయ్యా పది పన్నెండేళ్ల వయసులో ఒక భోగం మేళానికి వెళ్లి ఈ విశేషాలు చూశాం. మామూలుగా చూసేవారికి అది సరదాగా ఉండే నృత్యప్రదర్శనలాగే ఉంటుంది. ఐనా ఇంటికెళ్లేక, మేమెక్కణ్ణించి వస్తున్నామో తెలిసి, మా తాతగారు బాగా చీవాట్లు వేశారు. ఆ తర్వాత మళ్లీ భోగంమేళాలు చూడలేదు. సినిమాల్లో పద్మాఖన్నా, జ్యోతిలక్ష్మి, జయమాలిని, విజయలలితల వగైరాల నృత్యాలు చూసినా – వాటిని భోగంమేళాలని అనుకోలేదు. ఎందుకంటే ఆ సినీ నృత్యాలు భోగంమేళాల్లా కాక అసభ్యంగా అనిపించేవి. ఇక ఇక్కడి విషయానికొస్తే –

ఎవరో ఏదో అంటారనీ, అనుకుంటారనో బెంగ లేదు. పోలీసులు దాడి చేస్తారన్న భయం లేదు. ఉన్నదేమో, – అసభ్యత అనే మాటని పవిత్రపదంగా మార్చే వాతావరణం. అలాంటి ప్రదర్శన జరిగే ఆవరణలో ప్రవేశార్హతకి – ఐదు మార్కుల టికెట్టూ, ఆరున్నర మార్కుల బీరూ చాలు. ఎంత సులభం!

ఇందాకటి మహిళ వెళ్లగానే, మరో యువతి వచ్చింది. ఈమె ముఖం బాగా లేతగా ఉంది. వయసు ఇరవై దాటకపోవచ్చు. మళ్లీ మళ్లీ చూడాలనిపించే ముఖసౌందర్యం ఆమెది. కానీ ఆమె ముఖ సౌందర్య ప్రదర్శనకి రాలేదని అక్కడి వాతావరణమే చెబుతోంది.

ఆ యువతి రాగానే కొత్తగా సంగీతం ఆరంభమైంది. సంగీతం మొదలవగానే ముందామె ఓవర్‌కోట్‌తీసేసింది. ఆతర్వాత తాత్సారం చెయ్యకుండానే చకచకా ఒకటొక్కటిగా వంటిమీద దుస్తులన్నీ తీసేసింది. అప్పుడు మొదలైంది అసలు ప్రదర్శన.

ఆమె శరీర లావణ్యం అద్భుతం. కానీ ప్రదర్శన అంతా నాభికి పైనా, క్రిందా మాత్రమే. ఆమె ప్రదర్శన గురించి ఏం చెప్పాలన్నా మామూలు భాష పనికిరాదు. జయదేవుడి సంస్కృతమో, చౌడప్ప తెలుగో కావాలి.

బాగా నల్లగా ఉన్న మనిషి నలుపు గురించి అర్థం కావడానికి, “అతను బొగ్గుని విభూతిగా పెట్టుకోవచ్చు” అనడం సామెత. అలా ఇక్కడ సభ్యత అనిపించుకునే ప్రదర్శన ఒకే ఒక్కటి. అది కాస్త సభ్యంగా చెప్పడానికి వాడిన పదాలు కూడా శ్రీనివాసుని సుప్రభాత పదాలు కదా అని సరిపెట్టుకుంటే – ఆమె తన కుచచూచుకాలను నలిపి గట్టిగా చేసింది. ఆ రెంటికీ కలిపి ఓ సన్నటి బంగారు గొలుసును వ్రేలాడదీసింది. ప్రేక్షకులు చప్పట్లు కొడితే వినయంగా అభివాదం చేసింది. ఆ వెంటనే తన వ్యానిటీ బ్యాగుని గాలిలోకి ఎగరేసి, బంగారు గొలుసు స్థానంలో వ్రేలాడేలా చేసింది. మళ్లీ చప్పట్లు మారుమ్రోగాయి.

ఇంతకుమించి ఆ ప్రదర్శన విశేషాలు చెప్పడం ఈ రచనకు న్యాయం చెయ్యదు. మదపిచ్చి ఉన్న ఒక మగాడు – ఆడదాని గురించిన ఆలోచనల్లో ఎంతటి అసభ్యతకూ, అశ్లీలతకూ తావిచ్చినా కూడా – అప్పుడక్కడ జరిగిన ప్రదర్శన స్థాయికి చేరుకోగలడనిపించదు.

ఆమె కార్యక్రమం ముగిసేక వరుసగా రెండు నీలిచిత్రాలు చూపించారు. స్త్రీపురుషుల కామకేళిని వారు చిత్రీకరించిన విధానం చూస్తే – జయదేవుడి గీతగోవిందం శంకరాభరణం చిత్రంలా అనిపించొచ్చు. కథ ఏమాత్రం లేని యాక్షన్ చిత్రాలవి.

సినిమాలయ్యేక – మరో యువతి వచ్చింది. యూరోపియన్ దేశాలు జాతివివక్షకు తావివ్వవని నిరూపించుకోవాలన్న తాపత్రయం ఈ ప్రదర్శనలోనూ కనిపిస్తుంది. వచ్చినామె ఆఫ్రికన్ యువతి. ఆమె ప్రదర్శన అయ్యాక మళ్లీ మొదటి మహిళ వచ్చింది.

మాలో ఆసక్తి తగ్గిపోయింది. ఏ కాంతతోనైనా ఏకాంతానికి పరిమితం కావాల్సిన నగ్నసత్యాలు – ఇందరి మధ్య సామూహికంగా కళ్లబడ్డం ఏమిటోలా వెగటుగా అనిపించింది.

లేచి వెళ్లిపోవాలనుకున్నాం. కానీ, మా ముగ్గురి ఇళ్లూ కూడా అక్కడికి బాగా దూరం. నడిచి వెళ్లాలి.

అర్థరాత్రి. దేశం కాని దేశం. అదీ నైట్‌క్లబ్బునుంచి వెడుతూ. నడవడానికి – కొంత రాత్రి భయం, కొంత పరువు భయం.

అప్పటికి టైం రెండు కావస్తోంది. తెల్లవారాలంటే కనీసం నాలుగయ్యేదాకా ఉండాలి. మేమిలా తర్జనభర్జన పడుతుంటే నైట్‌క్లబ్ మనిషొకడు దేవదార్‌వద్దకొచ్చాడు. “ఒక్క బీర్ ఆర్డరిచ్చి రాత్రంతా ఇక్కడే ఉండిపోవాలని అనుకుంటున్నారు. ఎస్ గేష్ట్ నిష్ట్ (ఇదేం బాగోలేదు)” అన్నాడు.

ఏంచెయ్యాలో తెలియక, “ఇంకో బీరు ఆర్డరిద్దామా?” అన్నాను నేను.

“మాకిక తాగాలని లేదు. నువ్వు తాగుతానంటే సరే” అన్నారు దేవదార్, కొరియాలు.

“అమ్మగారైతే దిబ్బరొట్టే కాయం” అన్నట్లు, వాళ్లా మాటనగానే డెసిషన్ అయిపోయింది. వెంటనే అంతా అక్కణ్ణించి బయటపడి అమ్‌శాండే మార్కెట్ సెంటర్ చేరుకున్నాం.

ఆ సమయంలో అక్కడ జనసంచారం ఉండదనుకున్నాం కానీ – అక్కడో మూడు జంటలున్నాయి. వాళ్లు మమ్మల్ని చూసి నవ్వుతూ పలకరించారు. కానీ మేము వాళ్లని పలకరించడానికి ఇబ్బంది పడ్డాం.

వాళ్లున్నది మార్కెట్ సెంటర్లో. కానీ బెడ్రూంలో ఏకాంతంగా ఉన్నంత చనువుగా ప్రవర్తిస్తున్నారు. కలిసి ఛోంచేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నట్లు – చాలా ఫ్రీగా ఉన్నారు.

"వీళ్లకి వంటిమీద బట్టలున్నాయి. కానీ వీళ్లని చూస్తుంటే – నైట్‌క్లబ్బు నడివీధికొచ్చినట్లుంది" అన్నాను.

"మనమెందుకూ సిగ్గుపడడం? వాళ్లలో అమ్మాయిలు కూడా సిగ్గుపడ్డం లేదు. ఇదో సంస్కృతి!" అన్నాడు దేవదార్.

బీరు ఆర్డరివ్వక్కర్లేదు. ఇవ్వకపోతే "ఎస్ గేప్ట్ నిష్ట్" అనేవాళ్లు లేరు. కాబట్టి నడివీధి నైట్‌క్లబ్బులో నాలుగయ్యేదాకా కాలక్షేపం చేశాం.

నాలుగయ్యేసరికి కాస్త వెలుతురొచ్చింది. మేం ముగ్గురం విడిపోయి ఎవరిళ్లకి వాళ్లు బయల్దేరాం.

నా ఇంటిదారి శ్మశానం పక్కనుంచి ఉంది. పగలెప్పుడూ నేనా శ్మశానానికి భయపడలేదు. కానీ ఇంకా పూర్తిగా తెల్లవారక పోవడంవల్ల నాకా శ్మశానాన్ని దాటుతున్నప్పుడు చాలా భయమేసింది. ఎలాగో ధైర్యం తెచ్చుకుని, గుండె చిక్కబట్టుకుని ముందడుగు వేశాను. ఇల్లు చేరాక చాలా రిలీఫ్‌గా ఫీలయ్యాను. నా భయం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ నా గదిలోకెళ్లి మంచంమీద మేను వాల్చగానే వెంటనే నిద్ర పట్టేసింది.

నేనిలా లేచి కాలకృత్యాలు మొదలెట్టానో లేదో, ఫ్రౌ యాకేల్‌వచ్చి గది తలుపు తట్టింది. తలుపు తీసి, "గ్యుటెన్ మోర్గన్ (గుడ్‌మార్నింగ్)" అని విష్ చేశాను.

ఆమె కూడా విష్ చేసి, "తెల్లవారు ఝామున మెట్ల దగ్గర చప్పుడయింది. ఇది మొదటిసారి కాదు. ఆ వైయాంగ్ ఇలా తరచుగా ఎక్కడికో వెళ్లి వస్తుంటాడు. అతనితో నాకు గొప్ప డిస్టర్బెన్సుగా ఉంది. ఎప్పుడు గది ఖాళీ చేస్తాడో ఏమో" అని చిరాకుగా గొణుక్కుని వెళ్లిపోయింది.

మొదటిసారి కాదని అంది కాబట్టి ఆమె నన్నుద్దేశించి ఆ మాటలు అనుండదని అర్థమైంది. ఐనా ఆ మాటలు నాకే తగిలి మనసు చివుక్కుమంది. ఐతే ఆ రాత్రి నేను నైట్‌క్లబ్బుకి వెళ్లొచ్చానన్న నిజం ఆమెకి చెప్పలేదు. చెప్పాలనీ అనుకోలేదు. సంజాయిషీ అవసరం లేనిచోట కూడా నిజాన్ని దాచాలనుకోవడం – సామాన్యుల బలహీనత ఏమో!

## సృష్టిలో తీయనిది

స్నేహానికి నిర్వచనమైన రమణ–బాపులు 1977లో స్నేహం అనే సినిమా తీశారు. ఆ తర్వాతనుంచి ఎవరైనా, 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అంటే, 'ఏమో, మేము తీశాం' అని శ్లేషించేవారు రమణ.

మనిషికీ మనిషికీ ఏర్పడే గొప్ప బంధాల్లో స్నేహం ఒకటి. కొందరికి అనుకోకుండా స్నేహితులేర్పడతారు. కొందరికి స్నేహాన్వేషణే జీవితం. ల్యూనబర్గులో ఉండే ఫ్రౌ క్రిస్టా లూథర్ ఈ రెండో కోవలోకి వస్తుంది.

ల్యూనబర్గులో జర్మన్ కోర్సు పూర్తి కావచ్చింది. పది పన్నెండు రోజుల్లో మేమా ఊరొదిలి వెడతామనగా – మా క్లాస్‌మేట్సులో ఫ్రెంచ్ అమ్మాయి ఫ్రౌలైన్ కాసింబర్గ్ తనింటికి నన్నూ, నటరాజన్నీ ఆహ్వానించింది. ఆ రోజు సాయంత్రం ఆరుకి కాస్త ముందే ఇద్దరం ఆమె ఇంటికి వెళ్లాం. క్రిస్టా లూథర్ కాసింబర్గ్ హౌస్‌ఫ్రౌ. ఆమె కాసింబర్గుతో గతంలో జరిగిన హౌస్‌ఫ్రౌ ఔస్‌ఫ్లూగ్‌కి వచ్చిందిట. అక్కడ ఇండియన్స్ ఆమెకి ప్రత్యేకంగా అనిపించేరుట. ఇదివరలో విలువలు పాటించే జర్మన్సుకీ, ఈ ఇండియన్సుకీ చాలా పోలికలు కనిపించి, కాసింబర్గుకి చెప్పిందిట – ఒకసారి కొందరు ఇండియన్సుని తమ ఇంటికి పిలవమని. ఆమె మమ్మల్ని ఎన్నుకుంది.

క్రిస్టా వయసు ముప్పైకీ నలభైకీ మధ్యలో ఉండొచ్చనీ, ఎందుకో ముఖంలో ఇంకా ఎక్కువ వయసున్న బరువున్నదనీ అనిపించింది. కానీ ఆ బరువు మాటల్లోకి బదిలీ కాలేదు. ఇంచుమించు వెంటనే ఆమె మా జట్టులో, మాలో ఒకరిగా కలిసిపోయింది.

పాత అనుభవాన్ని బట్టి మేమామెకి బొకే ఇచ్చాం. థాంక్స్ చెప్పింది కానీ, అది మాత్రం రొటీనే.

అక్కడ మా జట్టులో మేము, కాసింబర్గ్ కాక – ఆమె కుమారుడు పదేళ్లవాడు, ఆ ఇంట్లోనే ఉంటున్న ఓ టర్కిష్ యువకుడు ఉన్నారు.

ఒకొక్కరి మాట తీరు అసామాన్యం. క్రిస్టా లూథర్‌మాటల్లోంచీ ఆత్మీయత ఎంతలా ఒలికిందంటే, కాసేపటికే నాకు నాస్వంతింట్లో ఉన్న అనుభూతి కలిగింది.

నటరాజన్ టీ తీసుకున్నాడు. నేను చల్లటి పాలు తాగాను.

నా గురించి కాసింబర్గ్ ద్వారా క్రిస్టాకి ముందే సమాచారం అందినట్లుంది. మిగతావారికి మాంసాహారం వండినా, నాకోసం ప్రత్యేకంగా వెజిటేరియన్ ఐటం చేసేనంది. అదేమిటో తెలియలేదు కానీ తినగలిగేలాగానే ఉంది.

టర్కిష్ యువకుడి ప్రవర్తన కాస్త వెకిలిగా ఉంది. ముఖ్యంగా క్రిస్టాతో చాలా చనువు ప్రదర్శించాడు. నాకది తప్పుగా అనిపించలేదు. కొద్ది క్షణాల పరిచయంలో మాకే చాలా ఆత్మీయంగా అనిపించింది క్రిస్టా. అలాంటిది చాలాకాలంగా ఆ ఇంట్లో ఉంటున్న అతని చనువు సహజమే అనిపించింది.

మనమున్న వాతావరణాన్ని బట్టి ఆలోచనలు మారతాయి. సంస్కారంపట్ల అవగాహనా పెరుగుతుంది.

పిలిచి వండింది అతిథులకి పెడితే, అది మామూలు విందు. క్రిస్టా మాకు మామూలు విందుతో సరిపెట్టే ఉద్దేశ్యంలో లేదు. “మీరిప్పుడు ఏదైనా ఇండియన్‌వంటకం చెయ్యాలి” అంది మాతో.

ఉన్నపళంగా ఏదో వంట చెయ్యమంటే – ఏంచేస్తాం అనేందుకు లేదు. అప్పటికే ఆమె బియ్యం, కూరలు, కొన్ని మసాలా దినుసులు కొని ఉంచింది. ఎలా చెయ్యాలో తెలియదు కానీ, ఇండియన్ వంటలు వేటితో చేస్తారో ఆమెకి కొంచెం ఐడియా ఉంది.

ఈ ప్రతిపాదనకి నటరాజన్ హుషారెక్కాడు. జర్మనీ వచ్చేక అతనికి వంట చెయ్యడం బాగానే అలవాటైంది. బాగా చేస్తానని కూడా అనుకుంటున్నాడు. ఇంతవరకూ తన వంటని తిని మెచ్చుకున్న బయటివాణ్ణి నేనే. తన పాకప్రావీణ్యాన్ని ఇతరులు, ముఖ్యంగా విదేశీయులు మెచ్చుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడనుకుంటాను – క్రిస్టా ఇలా అనగానే, తనిలా “నేను వెజిటబుల్ పులావ్‌చేస్తాను” అన్నాడు.

నటరాజన్ చెఫ్ ఐపోయాడు. నేను కూరలు తరగడం వంటి పై పనుల్లో సాయం చేశాను. అతను తరిగిన కూరగాయలు బియ్యంలో కలిపి ఉడకబెట్టి పులావ్ చేశాడు. బంగాళాదుంపలు, ఉల్లిపాయలతో కూర చేశాడు. తినేవాళ్లలో పాశ్చాత్యులు కూడా ఉన్నారు కాబట్టి, కూరలో పచ్చిమిర్చి బాగా తగ్గించి వేశాడు. అయినా కారం కాస్త ఎక్కువే అయినట్లుంది. తినేటప్పుడు క్రిస్టా కొడుకు, కాసింబర్గ్‌ల కళ్లల్లో నీళ్లు తిరగడం చూశాం. కానీ మర్యాదకో ఏమో – కూర కారంగా ఉన్నదని వాళ్లు ఒప్పుకోలేదు. రుచి చాలా బాగుందని మరీ మరీ నొక్కి చెప్పారు. క్రిస్టా కూర చాలా బాగుందని మెచ్చుకుంది. అందరిలోకీ మా వంటకం నచ్చింది టర్కిష్ యువకుడికి. అతను ఫోర్కు, చెంచా వాడకుండా చేత్తోనే పులావ్, కూర లొట్టలేసుకుంటూ తిన్నాడు.

భోంచేస్తూ అందరూ మధ్యమధ్య వైన్ తాగారు. నేను, క్రిస్టా కొడుకు నిమ్మరసం తాగాం.

క్రిస్టాకి నన్ను చూస్తే జాలేసినట్లుంది, “ఇంత మంచి వైన్ మిస్సవుతున్నావు. దీన్ని నీకు నిషేధించిన సంప్రదాయం గురించి నీకెలాగుందో కానీ, నాకు చాలా బాధగా ఉంది” అంది.

“అయ్యో! అనవసరంగా బాధపడుతున్నావు. నీకిప్పుడు రెండు విషయాలు చెప్పాలి. ఒకటి – నేను సంప్రదాయానికి లోబడాలనుకునే మనిషిని కాను. రెండు – నేను పుట్టి పెరిగిన సంప్రదాయం నాకు మద్యమాంసాల్ని నిషేధించలేదు. నాకు వైన్‌మీద ఆసక్తి లేదంతే!” అన్నాను.

క్రిస్టా ఒప్పుకోలేదు, “ఏ సంప్రదాయ నిషేధమూ లేకుండా వైన్‌మీద ఆసక్తి ఉండదంటే నమ్మడం కష్టంగానే ఉంది. ఐనా ఒకటి చెప్పు. నీది హిందూ మతమేగా? ఆ మతం ప్రకారం – ఇది చెయ్యొచ్చు, ఇది చెయ్యకూడదన్న నియమం లేదంటావా?” అంది.

అప్పుడామెకి నేను చెప్పాను, “హిందూత్వం జీవనవిధానమే కానీ, మతం కాదు. మాలో ఫక్తు మాంసాహారులు, ఫక్తు శాకాహారులు ఉన్నారు. మద్యం వర్జనీయమని ఎవరూ అనరు. అంతే కాదు, హిందువులు ఏ మతం దేవుణ్ణయినా పూజించుకోవచ్చు. మా సంప్రదాయాలు, ఆచారాలు చాలావరకూ వ్యక్తిగతం”.

క్రిస్టా కళ్లలో ఆశ్చర్యం. నేను చెప్పింది – ఇండియా గురించీ, హిందూమతం గురించీ ఆమె విన్నవాటికి భిన్నంగా ఉన్నట్లుంది. నానుంచి సరైన సమాధానాలు లభిస్తాయనిపించిందో ఏమో – కొన్ని కీలకమైన ప్రశ్నలడిగింది. వాటిలో ఒకటి — “ఏ మతం వాళ్లయినా వారానికొకసారైనా ఆలయానికి వెళ్లాలి కదా, ఇక్కడ మీ గుడి లేకపోతే, ఏంచేస్తారు? చర్చికి వెడతారా?” అన్నది.

“ఎవరో రమ్మంటే తప్ప, నాకు నేనుగా గుడికి వెళ్లడం అరుదు. అలా ఏళ్ల తరబడి గుడికి వెళ్లని సందర్భాలున్నాయి. ఇక్కడికొచ్చేక గుడికెళ్లే ఆలోచనే రాలేదు. ఇక చర్చి విషయానికొస్తే – ప్రార్థనలు చెయ్యడానికైతే చర్చికి వెళ్లను. మిత్రులెవరైనా చూడ్డానికి రమ్మంటే తప్పక వెడతాను” అన్నాను.

క్రిస్టా కళ్లలో ఆశ్చర్యంతో కూడిన అపనమ్మకం. “మరి మీ దేశంలో ఆడవాళ్లమీద చాలా ఆంక్షలున్నాయి కదా! భర్త పోయిన మహిళకి మరో పెళ్లి చేసుకునే అర్హత లేదనీ, అసలామె వీధి ముఖమే చూడకూడదనీ విన్నాను. అది సబబేనా?” అంది.

నేనేదో చెప్పేలోగా నటరాజన్ అందుకుని, “నువ్వన్నది కొంత నిజం. మా పల్లెటూళ్లలో ఏ ఆడవాళ్లకైనా మగాళ్ల కంటబడ్డం నిషిద్ధం” అన్నాడు చటుక్కున. ఇండియా గురించి తనూ ఏదైనా చెప్పాలని అతని తాపత్రయం.

షాక్‌తిన్నట్లు చూసింది క్రిస్టా. తేరుకున్నాక నావంక, “దీనికేమంటావ్” అన్నట్లు చూసింది.

నేను తడబడకుండా సద్దుకున్నాను. “ఇండియా చాలా పెద్ద దేశం. మాలో ఎక్కువమంది నిరక్షరాస్యులు. అది ఆధారంగా చేసుకుని కొన్నిచోట్ల కొంతమంది పెద్దలు తమకి తోచిన నియమాలు విధించి పెత్తనం చెలాయిస్తుంటారు. నటరాజన్ చెప్పినలాంటివి అక్కడక్కడ జరుగుతూ ఉండొచ్చు. కానీ నేను పల్లెటూళ్లో చదువుకున్నాను. నా క్లాస్‌మేట్లలో ఆడపిల్లలున్నారు. టీచర్సులో ఆడవాళ్లున్నారు. అదలాగుంచితే – మా దేశానికి ప్రధాని ఒక మహిళ. ఆమె విధవ. ప్రజలామెను శక్తి స్వరూపిణిగా ఆరాధిస్తారు. నాకు తెలిసి ఇంతవరకూ అమెరికాలోకానీ, జర్మనీలో కానీ మహిళలకు ఇంత హోదా దక్కలేదు” అన్నాను.

క్రిస్టా మౌనం వహించింది. ఆమె ఆలోచనలో పడిందని గ్రహించి నేనూ ఊరుకున్నాను. హిందూత్వం గొప్పతనాన్ని ప్రచారం చేసే ఉద్దేశ్యం నాకు లేదు. కానీ ప్రపంచంలో హిందూత్వమంతగా అపార్థానికి గురైన మతం మరొకటి లేదు. అందుకు కారణం – ఎవరికి వారు తమకు హిందూత్వం గురించి అంతా తెలుసనుకునే హిందువులే. తాము ఆచరించకపోయినా, లేని నియమాల్ని కూడా మతానికంటగట్టే అలవాటు చాలామంది హిందువులకుంది.

హిందూత్వం పేరిట నేను కొన్ని పద్ధతులు అనుసరిస్తున్నాను. అవి నాకు నచ్చాయి. ఆ మేరకు నాకు హిందూత్వంపట్ల స్పష్టమైన అవగాహన ఉంది. ఆ కోణాన్ని ఇతరుల ముందు, అందులోనూ విదేశీయులముందు ఉంచేటప్పుడు యథాలాపధోరణి పాటించను.

నటరాజన్ తన సబ్జక్టులో దిట్ట. హృదయం చాలా మంచిది. మతానికి సంబంధించిన విషయాల్లో ఏమాత్రం సీరియస్‌కాదు. ప్రస్తుతం క్రిస్టా లూథర్‌తో కాలక్షేపం కబుర్లకోసం మతాన్ని ఎన్నుకున్నాడు. ఆ ఊపులో తనకి తోచిన వివాదాస్పద విశేషాలు మరికొన్ని చెప్పాడు. ప్రతిసారీ నేను కలగజేసుకుని వివరణలతో సద్ది చెప్పాను. నా సమస్య ఏమిటంటే – ఇటు నటరాజన్ని నొప్పించకూడదు, అటు క్రిస్టాకి హిందూత్వం పట్ల పొరపాటు అభిప్రాయం కలక్కూడదు.

నా తపన నటరాజన్‌కి అర్థమైంది. తను చెప్పేది చెప్పేక, నేనిచ్చే వివరణలని అతను ఖండించలేదు. క్రిస్టా కూడా అతనేం చెప్పినా నానుంచి వివరణకోసం చూసేది.

అలా సరదాగా గడిచిపోతున్న సమయంలో అక్కడికి ఒక జర్మన్ మహిళ, యువకుడైన ఆమె కుమారుడు వచ్చారు. వాతావరణం కొంచెం గంభీరమైంది.

యువకుడు చలాకీగా ఉన్నాడు. తను సిలోన్‌లో పుట్టాననీ, ఇంగ్లీషు వచ్చుననీ అంటూనే, "ఇక్కడ జర్మనే మాట్లాడుదాం. మీకు ప్రాక్టీసవతుంది" అన్నాడు. అతనికి రాజకీయాలపట్ల ఆసక్తి ఎక్కువే. ఇండియా ఆటంబాంబ్ పేల్చడం గురించి ప్రస్తావిస్తే, క్రిస్టా మాట మార్చాలనుకుందేమో, "టైమ్ చాలానే అయింది. ఇక స్లైడ్స్ చూద్దామా" అంది.

ఐతే స్లైడ్‌షో అప్పటికప్పుడు అనుకున్నది కాదు. ఆమె ముందే ప్రొజెక్టర్ని సిద్ధం చేసి ఉంచింది.

స్లైడ్‌షో ఉన్నదని కాసింబర్గ్ మాకు ముందే చెప్పింది. అందుకని నటరాజన్ దేవదార్‌నడిగి కొన్ని ఇండియన్ స్లైడ్స్ తెచ్చాడు. సందర్భం వస్తే చూపించొచ్చని దేవదార్ ఇండియానుంచి కొన్ని స్లైడ్స్ తెచ్చాడు. అవీ ఇవీ కలిపి అక్కడున్న అందరం కుతూహలంగా స్లైడ్స్ చూశాం. కానీ ఎందుకో కాసింబర్గ్ అన్యమనస్కంగా ఉంది. అది చూసి టర్కిష్‌యువకుడు, "వైన్ బాగా కిక్ ఇచ్చినట్లుంది. ఈమాత్రం వైనుకే ఇలాగైపోతే, రేపు మీ హోటల్లో డాన్సెలా చేస్తావ్?" అన్నాడు.

కాసింబర్గ్ పారిస్‌లో ఓ హోటల్లో డాన్సర్ కమ్ రిసెప్షనిస్ట్. కస్టమర్సుకోసం ఆమె చాలా భాషలు నేర్చుకుంది. జర్మన్ నేర్చుకుందుకు ఇక్కడికొచ్చింది.

టర్కిష్ యువకుడి మాటలు వినగానే ఆమె చివాలున లేచి లోపలకెళ్లిపోయింది.

నాకు తెలుసు – ఆమె సున్నిత మనస్కురాలని. లాంగ్వేజ్ కోర్స్ మధ్య వచ్చిన సెలవుల్లో కోపెన్‌హాగన్ వెళ్లొచ్చి, "పారిస్‌లో పుట్టి పెరిగిన నాకు శృంగారప్రదర్శనల్లో విచ్చలవిడితనం కొత్త కాదు. కానీ కోపెన్‌హాగన్‌లో శృంగారం వేసిన వెర్రితలలకి తట్టుకోలేకపోయాను" అని మాటల సందర్భంలో నా దగ్గర బాధపడింది. కానీ ఇప్పుడు టర్కిష్ యువకుని మాటల్లో, అంతగా డిస్టర్బ్ అవాల్సినదేమిటో అర్థంకాక ప్రశ్నార్థకంగా క్రిస్టాని చూశాను.

అప్పుడు క్రిస్టా అసలు విషయం చెప్పింది.

కాసింబర్గ్ కార్లో అనే ఓ ఇటాలియన్ యువకుణ్ణి ప్రేమించింది. జూలై చివరి వారందాకా ఇద్దరూ కలిసి తిరిగారు. ఆతర్వాత అతను రోమ్ వెళ్లిపోయాడు. మళ్ళీ వస్తానన్నాడు కానీ అప్పుడప్పుడు ఫోన్లు చేస్తాడే తప్ప తన రాక గురించి మాట్లాడ్డం లేదు. ఆ రోజు ఆమె ఇంట్లో లేని సమయంలో రోమ్‌నుంచి ఫోనొచ్చిందిట. ఆమె లేదని తెలిసి మళ్లీ రాత్రి ఎనిమిదికి చేస్తానన్నాట్ట.

టైము ఎనిమిదయినప్పట్నించీ ఆమె మనసంతా ఫోన్‌మీదనే ఉంది. ఇంకా ఫోన్‌రాలేదు.

క్రిస్టా అంటుందీ – ఆ ఇటాలియన్‌కి కాసింబర్గ్‌పై మోజు తీరిపోయిందని.

మిగతావాళ్లం కబుర్లు కొనసాగిస్తూ రాత్రి పదయ్యేదాకా కాలక్షేపం చేసి, ఇక సెలవని లేచాం.

క్రిస్టాకింకా మాతో మాట్లాడాలని ఉన్నట్లుంది. ఆమె మాతో, "మీరిక్కణ్ణించి వెళ్లేలోగా మనం మరోసారి కలుసుకుందాం" అంది. సరేనన్నాను మామూలుగా.

"ప్రామిస్!?" అందామె వెంటనే. అప్పుడామెని చూస్తే ఆమె కళ్లు కూడా, "ప్రామిస్!?" అంటున్నాయి.

దాంతో అర్థమయింది – ఆమె మళ్లీ కలుసుకుందామన్న మాట యథాలాపంగా అనలేదని.

ఆమె చెప్పిందో, తనే పిలిచిందో కానీ సరిగ్గా మరుచటి వారమే కాసింబర్గ్ మమ్మల్ని వాళ్లింటికి ఆహ్వానించింది. ఆ రోజు నేను, నటరాజన్ కాస్త ఆలస్యంగా వెళ్లాం. పెద్దగా విశేషాలు లేవు కానీ, కాసింబర్గ్ చాలా హుషారుగా ఉంది. ఆమెకి కార్లోనుంచి ఫోనొచ్చిందిట. టర్కిష్ యువకుడు కూడా మంచి మూడ్‌లో ఉన్నాడు. నేను తెచ్చిన రవిశంకర్ సితార్ క్యాసెట్ విని అతను పరవశించిపోయాడు. ఆ అభిరుచి నేనూహించనిది.

క్రిస్టా నన్ను ఇండియన్ ఫిలాసఫీ గురించి అడిగింది. నాకు తెలిసినవి చెబితే శ్రద్ధగా వింది.

వాళ్లకి మా అడ్రసులిచ్చి, వాళ్ల అడ్రసులు తీసుకున్నాం. ఇండియా వస్తే తప్పక మా ఇంటికి రావాలని నేను, నటరాజన్ – వాళ్లకి మరీమరీ చెప్పాం.

“అది సరే, మీరు మాత్రం వెళ్లేలోగా మరోసారి మా ఇంటికి రావాలి” అందామె.

“రావాలని మాకూ ఉంది కానీ, ఇంక మేముండేది నాలుగు రోజులే” అన్నాను.

“అంటే ఇంకా నాలుగు రోజులుంటారనేగా?” అని నవ్వింది క్రిస్టా.

అభిమానం, ఆత్మీయత నిండిన ఆ నవ్వు మళ్లీ చూస్తామా అనుకున్నాను కానీ, క్రిస్టా సంకల్పబలం సామాన్యమైనది కాదని, సరిగ్గా రెండు రోజుల తర్వాత తెలిసింది.

ఆ సాయంత్రం పెద్ద వాన పడుతోంది. ఉన్నట్లుండి తలుపు తట్టిన చప్పుడైతే తీశాను. ఫ్రౌ యాకేల్!

“నీకోసం ఎవరో వచ్చారు” అందామె

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments